క్లుప్తంగా

వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన



వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన చేస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినం సందర్భంగా సోమవారం స్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి గణపతి పూజ, రుద్రాభిషేకం, మారేడు దళాలతో బిల్వార్చన చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పచ్చిపూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సత్యసాయి బాల వికాస్ కేంద్రాలు ప్రారంభం

అమలాపురం టౌన్: అల్లవరం మండలం బోడసకుర్రు, అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామాల్లో రెండు బాల వికాస్ కేంద్రాలను అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావన, మానవతా విలువలు పెంపొందించేందుకు బాల వికాస్ కేంద్రాలు ఎంతగానో తోడ్పుతున్నాయన్నారు. బాల వికాస్ కేంద్రాలకు వచ్చిన బాలబాలికలకు డాక్టర్ ప్రభాకర్ పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో బాల వికాస్ గురువు శిష్టా గుణ రంజాన్, నూలు సుబ్బారావు, జి.సుబ్రహ్మణ్యం, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం 7వ వార్డు సభ్యురాలిగా చినమంగ

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం 7వ వార్డు సభ్యురాలిగా పెయ్యల చినమంగ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బి.మమత తెలిపారు. వార్డు సభ్యుని కోసం రెండు నామినేషన్లు వచ్చాయని, అందులో ఒక నామినేషన్ తిరస్కరించబడటంతో చినమంగకు వార్డు సభ్యురాలిగా ధ్రువీకరణ పత్రం అందించామన్నారు. నూతనంగా ఎన్నికైన చినమంగను సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, పంచాయతీ కార్యదర్శి కె.రామలక్ష్మి తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సుభాషిణి, ఎంపీటీసీ రాజేశ్వరి

అల్లవరం: టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ వడ్డి సుభాషిణి, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరిలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పోషక పదార్థాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 4 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

యానాం: అప్పర్ డివిజినల్ క్లర్క్(యూడీసీ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకూ పుదుచ్చేరి సెక్రటేరియట్‌లోని మూడో అంతస్తులో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో పరిశీలించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ కార్యదర్శి వి.జయశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, ఎస్ఎస్‌సీ, నివాస, కమ్యూనిటీ సర్టిఫికెట్‌లను వెంట తెచ్చుకోవాలన్నారు.

జగనన్న పాల వెల్లువపై సమీక్ష

అల్లవరం: మండలంలోని తొమ్మిది సచివాలయాల్లో ఏర్పాటుకానున్న జగనన్న పాల వెల్లువ పథకంపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ కృష్ణమోహన్ సోమవారం సమీక్ష నిర్వహించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ జగనన్న పాల వెల్లువ భవనాలు, భవనాలకు విద్యుత్ సౌకర్యం, మహిళా పాడి రైతులతో సంఘాల ఏర్పాటు, చేయూత లబ్ధిదారులను జగనన్న పాల వెల్లువకి మ్యాపింగ్ చేయడంపై సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎ.రాజా, రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

తాళ్లరేవు: మండలంలోని గుత్తులవారిపాలేనికి చెందిన వడ్రంగి కార్మికుడు వాసంశెట్టి ప్రసాద్(46) చనిపోవడంతో అతడి భార్య శ్రీదుర్గకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, రెడ్డిబాబుల చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ప్రమాద బీమాకు సంబంధించి మిగిలిన మొత్తం రూ.4.90 లక్షలు నేరుగా ఆమె బ్యాంకు ఖాతాలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టూరి లలిత, ఆకుల వెంకన్న, చిట్టూరి చలపతి, గుత్తుల శ్రీదేవి, శేషారత్నం, సతీష్, మంగామణి పాల్గొన్నారు.

త్వరలో మూడు వంతెనలకు మోక్షం

- సాక్షాత్తు సీఎం జగన్ ప్రకటించడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు
- అమలాపురంలో ట్రాఫిక్‌కు పడనున్న కళ్లెం



ప్రత్యామ్నాయ వంతెన నిర్మించనున్న అమలాపురం ఈదరపల్లి వంతెన

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో కీలకమైన మూడు వంతెనలకు ప్రత్యామ్నాయంగా మరో మూడు వంతెనలు నిర్మించేందుకు సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్లు చేసిన ప్రకటనతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మూడు వంతెలనకు రూ.10 కోట్లతో అంచనాలు, ప్రతిపాదనలు రూపొందించి వాటి నిర్మాణానికి కృషి చేస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రయత్నాలు ముఖ్యమంత్రి జగన్ ప్రకటనతో ఫలించాయి.

పట్టణ ప్రవేశ మార్గాల్లో ఉన్న ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెనలు నిర్మించి 50 నుంచి 70 సంవత్సరాలు పూర్తయ్యాయి. అప్పటి ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఈ మూడు వంతెనలు నేడు పెరిగిన వాహనాలు, జనాభాకు తగ్గట్లుగా సేవలు అందంచలేకపోతున్నాయి. ట్రాఫిక్ ఉచ్చులో పడి విలవిలలాడుతున్న అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం అయ్యాక ఆ అవస్థలు రెట్టింపయ్యాయి. దీంతో పట్టణంపై ట్రాఫిక్ ఒత్తిడి తీవ్రమై రోజూ ఏదో సందర్భంలో ఈ వంతెనలపై ట్రాఫిక్ స్తంభించిపోతోంది. మంత్రి విశ్వరూప్ ఈ సమస్య తీవ్రతను ముందే గమనించి మూడు వంతెనలకు ప్రత్యామ్నాయంగా వాటి పక్కనే మరో వంతెన నిర్మించేందుకు మూడు కొత్త వంతెలకు ప్రతిపాదనలు తయారు చేయించి ముఖ్యమంత్రి జగన్ దృష్టిలో పెట్టారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి సంబంధించి డ్వాక్రా మహిళల ఖాతాల్లో బటన్ నొక్కి లబ్ధిని జమ చేసేందుకు ఈ నెల 11న అమలాపురం వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ఈ మూడు వంతెనల గురించి ఆయనే స్వయంగా ప్రస్తావించారు. మంత్రి విశ్వరూప్ చెప్పిన ఈ అవసరాలు తీర్చేందుకు రూ.10 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు సభా వేదికపైనే ప్రకటించారు. దీంతో త్వరలోనే ఈ మూడు వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు టెండర్లు తదితర సాంకేతిక ప్రక్రియలకు సన్నాహాలు మొదలు కానున్నాయి. ఈ మూడు వంతెనలకు ప్రత్యామ్నాయంగా నిర్మించే మూడు కొత్త వంతెనలపై వన్ వే విధానంలో వాహనాలు వెళ్లేవి, వచ్చేవిగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలకు పూర్తిగా కళ్లెం పడనుంది.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



అమలాపురం పట్టణంలో పెరిగిన ట్రాఫిక్ నివారణకు మూడు కీలక వంతెనల నిర్మాణం గురించి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన వెంటనే స్పందించి నిధులు కేటాయించారు. అలాగే నియోజకవర్గంలోని గడప గడపకూ మన ప్రభుత్వం కింద ప్రతి సచివాలయానికి రూ.40 లక్షల వంతున సీఎం జగన్ నిధులు ఇవ్వడంతో అమలాపురంపై ఆయనకున్న అభిమానం మరోసారి రుజువైంది. నియోజకవర్గ ప్రజల తరఫున సీఎం జగన్‌కు నా కృతజ్ఞతలు.

– పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

సహకార సంఘాలతో రైతులకు ఎంతో మేలు



నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. సోమవారం జరిగిన ఐ.పోలవరం సహకార సంఘ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్‌గా విత్తనాల వెంకటేశ్వరావు, సభ్యులుగా సాధనాల రాజేశ్వరి, దంగుడుబియ్యం గోపాలకృష్ణలచే సీఈఓ గుత్తుల ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఈ సంఘం పనిచేస్తుందన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సఖిలే వెంకటేశ్వరావు, మెండా వెంకన్న, వడ్డి గౌతమ్, ఏలూరి ఆదినారాయణ, మోర్త చిన్నా తదితరులు నూతన కమిటీని అభినందించారు.

విద్యార్థినులకు నగదు బహుమతులు



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థినులతో బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు కెనరా బ్యాంక్ నగదు బహుమతులు అందజేసింది. 2022–23 సంవత్సరానికి సంబంధించి 6, 7 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు రూ.2,500 చొప్పున, 8, 9, 10 చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు రూ.5 వేల వంతున బహుమతులను అమలాపురం కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పందిరి కుమారస్వామి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మంచిగంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి.నాగేంద్రరాజు పాల్గొన్నారు.

బియ్యం కార్డుల పంపిణీ



బియ్యం కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు గ్రామంలో కొత్తగా మంజూరైన 58 బియ్యం కార్డులను సర్పంచ్ బీర సత్యకుమారి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, వైఎస్ ఎంపీపీ పిన్నంరాజు బాబ్జిరాజులు లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. కేశనకుర్రు సచివాలయం –1లో 8, సచివాలయం–2లో 24, సచివాలయం –3లో 26 మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో చింతా రాంబాబు, పెమ్మాడి చిన్నా, ఇందుకూరి రంగరాజు, రేవు వీరవెంకట సత్యనారాయణ, కాశి పరివాజ్ కుమార్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ శివారు దరియాలతిప్ప సమీపంలో ఉన్న అడివిపాలంలో ధర్టీ డ్రెడ్జింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి సంబంధించిన యోగాయోతాస్ పోర్ట్ అండ్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులపై దాడికి సంబంధించిన ఘటనపై బాధితులు సోమవారం యానాం ఎస్పీ రఘునాయగంకు ఫిర్యాదు చేశారు. మల్లాడి సత్తిబాబు, లంకే ఆంజి, లంకే శ్రీను, నాగూరు తదితరులు తాము పనిచేస్తున్న కంపెనీలోకి దౌర్జన్యంగా వచ్చి తమను దుర్భాషలాడుతూ తమపై దాడిచేసి దూషించారని బాధితులు మోకా నూకరాజు(బుజ్జి), సబ్బతి వెంకటేశ్వరరావులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

భూముల ఆక్రమణలపై మంత్రికి ఫిర్యాదు



మంత్రి లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని 33 ఎకరాల భూమిని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ భూమిని ఓఎన్‌జీసీ వంటి చమురుసంస్థలకు ఇచ్చి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణన్‌కు తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరావు సోమవారం వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజులకు సైతం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు, పెసింగి శ్రీను, బీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ కల్లా ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- తాళ్లరేవులో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



తాళ్లరేవు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) అభివృద్ధి పనులను వచ్చే అక్టోబర్ కల్లా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో కలిపి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో తాగునీటి వసతికి సంబంధించి సంపు నిర్మాణానికి, మార్చురీ నిర్మాణానికి జరుగుతున్న మార్కింగ్ పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో మార్చురీ నిర్మాణానికి స్థలం సరిపోకపోవడంతో పాటు ఆపరేషన్ థియేటర్ పక్కనే మార్చురీ నిర్మాణం సరికాదని వైద్యురాలు శిరీష తెలపడంతో మార్చురీని నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఐడీసీ డీఈ చక్రవర్తి, ఏఈ యోగికిరణ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రూ.4.44 కోట్లతో రెండు బ్లాకుల నిర్మాణం, రెండువార్డులు, బయో మెడికల్ వేస్ట్‌కు సంబంధించి మూడుగదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు అద్దంకి లక్ష్మీనారాయణ, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, వైఎస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, కొపనాతి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యానాం సమస్యల పరిష్కారానికి సహకరించండి



మంత్రి లక్ష్మీనారాయణన్‌ను కలిసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం ప్రాంత సమస్యల పరిష్కారానికి సహకరించాలని పుదుచ్చేరి ప్రజాపనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణన్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. సోమవారం యానాం విచ్చేసిన మంత్రి లక్ష్మీనారాయణన్‌ను ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మెల్యే అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రక్షిత మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు, గోదావరి వరద బెడద నుంచి తీర గ్రామాలను రక్షించేందుకు రూ.190 కోట్లతో రక్షణ గట్టు పనుల ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. యానాం సమస్యల పరిష్కారానికి అధికారులతో సమీక్షించి పనులు జరిగేలా చూస్తానంటూ హామీ ఇచ్చారు.

క్రీడల్లో మెరిసిన నవోదయ విద్యార్థులు



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యానాం: యానాం జవహర్ నవోదయ విద్యార్థులు దక్షిణ భారతదేశ రాష్ట్రాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి ప్రథమ స్థానానికి ఎంపికై జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తైక్వాండోలో శశిచందన, చదరంగంలో రిష్యేంద్రనాధ్యరెడ్డి, అథ్లెటిక్స్‌లో ఎం.దుర్గేష్, ఖోఖోలో నవ్య, హ్యాండ్‌బాల్‌లో నిహారిక జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వారంతా కర్ణాటకలోని హసన్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్, హర్యానాలోని పంచకుల, బీహార్‌లోని నలంద, గుజరాత్ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణనిచ్చిన లక్ష్మీప్రసన్న, వసంతకుమార్‌లను ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు, అధ్యాపకులు అభినందించారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన అధ్యక్షుడు సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్

అమలాపురం రూరల్: అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో కోనసీమ కుకింగ్ అండ్ క్యాటరింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్యాటరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వరదరాజులు హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సలాది సూర్యప్రకాశరావు, గౌరవ అధ్యక్షులుగా గుడివాడ రాంబాబు, బోనం రామకృష్ణ, పిట్టా శంకర్రావు, కార్యదర్శిగా రావూరి సత్య కిరణ్, ఉపాధ్యక్షుడిగా బోనం వీరబాబు, సంయుక్త కార్యదర్శులుగా మోటుపల్లి ప్రసాద్, మొగలపల్లి శేఖర్, కోశాధికారిగా వేమా నరసింహరావు ప్రమాణ స్వీకారం చేశారు.

యుద్ధ స్మారక స్థూపంపై నాగేంద్ర ఫొటో



ఢిల్లీలో నిర్మించిన యుద్ధ స్మారక స్థూపంపై పొందుపరిచిన సైనికుడు నాగేంద్ర

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన గోటేటి నాగేంద్ర మిలటరీలో సైనికుడిగా పనిచేస్తూ కార్గిల్ యుద్ధ సమయంలో ఆపరేషన్ పరాక్రమ్‌లో అశువులు బాశారు. ఆయన జ్ఞాపకార్థం ఢిల్లీలో ఇటీవల నిర్మించిన యుద్ధ స్మారక స్థూపంలో నాడు అశువులు బాసిన నాగేంద్ర ఫొటో, ఆయన వివరాలను పొందుపరిచారు. నాగేంద్ర సోదరుడు గోటేటి గంగాధరరావుకు ఈ సమాచారం ఈ–మెయిల్ ద్వారా అందింది. నాగేంద్రకు భారత ప్రభుత్వం గౌరవం ఇవ్వడంపై ఆయన సోమవారం సంతోషం వ్యక్తం చేశారు.

నలుగురు సోదరులూ సైనికులే

అమలాపురం గాంధీ బజార్‌లో ఉండే గోటేటి భాస్కరరావు, లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. వృత్తి రీత్యా ఆ దంపతులు హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందేవారు. వారి నలుగురు కుమారులైన రాజేష్, గంగాధరరావు, గాయత్రికుమార్, నాగేంద్రలను దేశ రక్షణలో భాగస్వాములను చేయాలన్న సదాశయంతో 50 ఏళ్ల కిందటే ఆ నలుగురినీ సైనికులుగా పంపించారు. వారంతా 1983 నుంచి 2015 వరకూ మిలటరీలో సైనికులుగా పనిచేశారు. నలుగురు సోదరుల్లో నాగేంద్ర కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందారు. మిగిలిన ముగ్గురూ సోదరులు మిలటరీలో పదవీ విరమణ పొంది అమలాపురం, కాకినాడ, విశాఖపట్టణాల్లో స్థిరపడ్డారు. తమ నలుగురు కుమారులను సైనికులను చేసిన ఆ తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందటే చనిపోయారు.

150 అడుగుల జెండాతో తిరంగా యాత్ర



మురమళ్లలో తిరంగా యాత్ర చేస్తున్న విద్యార్థులు

ఐ.పోలవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మురమళ్ల శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు 150 అడుగుల జెండాతో గ్రామంలో తిరంగా యాత్ర సోమవారం నిర్వహించారు. జై జవాన్, జై కిసాన్ నినాదాలతో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గోకవరపు వెంకట్రాజు, డైరెక్టర్ జి.కుమారి, ప్రధానోపాధ్యాయుడు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అమలాపురం రూరల్: భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం రాత్రి హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేశారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమ, యాళ్ళ దొరబాబు, మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ఐ.పోలవరం: ఇటీవల సున్నా వడ్డీ నాలుగో విడత నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మండల మహిళా సమాఖ్య సభ్యులు క్షీరాభిషేకం చేశారు. ఐ.పోలవరంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సమావేశం ఏపీఎం వి.శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాసరాజు మాట్లాడుతూ నాలుగో విడత సున్నా వడ్డీ రాయితీ మండలంలో 1,440 సంఘాలకు గాను రూ.కోటి 73లక్షలు మంజూరు అయిందన్నారు. ఇందుకు గాను పాలకవర్గ మహిళా సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఎంపిక చేయాలి



సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపన కోసం ఆత్మవిశ్వాసం, పట్టుదల, చొరవ కలిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఎంపిక చేయాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ నుపూర్ అజయ్ మాట్లాడుతూ ఏకగవాక్ష విధానంలో(సింగిల్ డెస్క్ విధానం) అన్ని అనుమతులు మంజూరు చేస్తూ యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో 30 సర్వీసులకు దరఖాస్తులు వచ్చాయని వాటిలో 23 సర్వీసులకు అనుమతులు ఇచ్చామన్నారు. జగనన్న బడుగు వికాసం కింద 16 దరఖాస్తులకు అనుమతులిచ్చామని చెప్పారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 238 యూనిట్ల మంజూరు లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 34 యూనిట్లు నెలకొల్పామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ పీకేపీ ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శివరామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి షేక్ లాల్ మహమ్మద్, డీపీవో కృష్ణకుమారి, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.